# స్నోస్టార్మ్

డా. వేద

"ఏమిటో, కొందరినైతే ఎలా అర్థం చేసుకోవాలో తెలియదు," అంటోంది శ్రీ.

"ఊఁ" అంటూనే అద్దంలో వెనక్కి ఓమారు జాగ్రత్తగా చూశాడు విస్సూ, ముందు కాలప్రవాహంతో సంబంధంలేకుండా అతినెమ్మదిగా కారు నడుపుతోన్న వృద్ధదంపతుల మీద మనసులో విసుక్కుంటూ. ఏమిటర్థం చేసుకునేది నామొహం! హాయిగా రిటైరయిపోయి మనమందరూ కట్టే పన్నులు పెట్టే తిండి తింటూ చీకూచింతా లేకుండా బ్రతుకు లాగించేస్తున్న ముసలాళ్ళని కాస్త వేగం పెంచరెందుకో అర్థం చేసుకోవడానికి ప్రయత్నించే బదులు ఓ దండం పెట్టేసి తప్పుకు పోతే పోలా అని మనసులోనే శ్రీతో బాతాఖానీ సాగించేస్తూండగా,

"ఏమిటి వింటున్నావా?" అలవాటయిన విషయమే అయినా గదమాయించింది కొంచెం అనుమానంగా.

"ఆఁ ఆఁ అన్నీ అర్థం చేసుకొవడానికి ప్రయత్నించాలంటావా, శ్రీ?" అంటూ చాకచక్యంగా తప్పుకున్నాడు, బ్లైండుస్పాటునోమారు చూసుకొని ముందు కారుని దాటే ప్రయత్నంలో.

"అంత వేగంగా కారు నడపకపోతే పాపం వాళ్ళు సరిగ్గా స్పీడ్‌లిమిటులోనే వెళుతున్నప్పుడు వాళ్ళ వెనకే వెళ్ళొచ్చుకదా. చూడు, పాపం పెద్దవాళ్ళయినా ఎంతచక్కగా కబుర్లు చెప్పుకుంటూ వెళ్తున్నారో," అంది దాటుతోన్న కారులో నవ్వుతూ కొంచెం దగ్గిరవడానికి ప్రయత్నిస్తున్న తెల్ల దంపతులను చూస్తూ.

"సరే మనమూ చక్కగా పెన్షనులా సోషల్‌సెక్యూరిటీ ఆదాయమూ, తక్కువ టేక్సుల దశలోకి వెళితే ఇంకా హాయిగానే ఉందాం, ఇప్పుడైతే ఎంతసేపూ ఆఫీసులో బాసుని నొప్పింపక కిందవాళ్ళొకరిద్దరిచేత తానొవ్వక రాజకీయాలు చేసుకుంటూ వెళితే తప్ప డొక్కాడదు. అయినా ఆలస్యమయిపోతోంది, స్నో కూడా మొదలయ్యింది, ఈ న్యూయార్కులో ఎంత స్నోపడ్డా సెలవిచ్చి చావరొకటీ," అంటూ జీవితంలోని యాతిబాధలన్నిటినీ వెళ్ళగ్రక్కేశాడు.

“నీకు సెలవు కాదూ, నా స్కూల్‌కి సెలవు ఇచ్చుతుంది నా ప్రిన్సిపాల్” వెనకనించి అందుకుంది తన తెలుగుపాండిత్యాన్ని ప్రదర్శిస్తూ ప్రీతి. ఐదో క్లాసు చదువుతోంది ప్రీతి.

“యా, నో నీడ్‌టూ ఫినిష్ మై హోమ్‌వర్క్‌ఫర్‌టుమారో,” అంటూ వంత పాడాడు ఒకటో క్లాసులో వున్న చేతన్. అక్క ఎప్పుడూ వాడితో ఇంగ్లీషే మాట్లాడడంతో, తల్లిదండ్రులుకూడా మరీ పట్టించుకోకపోవడంతో, తెలుగు నేర్చుకొనే అవసరమే రాలేదు వాడికి, కానీ అవసరార్థం అన్నీ అర్థం చేసుకుంటాడు, ముఖ్యంగా తిట్లతో సహా.

శ్రీ వాడితో, “ఒరే పిడుగా, నువ్వు చాలా బాగా ప్లేన్‌చేసేస్తున్నావుకానీ ఆ పప్పులేవీ వుడకవు. అసలిప్పటివరకూ చెయ్యకుండా ఆగడమేతప్పు. మీ ఒకటో క్లాసు హోంవర్కూ అదేదో నోబుల్‌ప్రైజు రీసెర్చన్నంతసేపు సాగదీసుకుంటూ చేస్తావు. పొద్దున్న ఐదోగంటకల్లా లేపుతాను చేస్తేతప్ప బ్రేక్‌ఫాస్టిచ్చేది లేదు.” అని చీవాట్లుపెట్టి, “ఇంతకీ మన హోంవర్కు సంగతేమిటి తల్లీ?” అంటూ అస్త్రాన్ని కూతురు వైపుకు తిప్పింది.

“నా హోమ్‌వర్కు నిన్న చేసేను. అంతా వేస్ట్” అని వాపోయింది ప్రీతి. ఈమధ్యనే తన చదువు విషయాలన్నీ కొంచెం బాధ్యతగా చేసుకోవడం మొదలుపెట్టింది.

“సరేలే, ఏమీ నష్టం లేదు. ఇంక మెల్లిగా నిద్రపోండి, ఇల్లు చేరుతూనే లేపుతా. గుడ్‌నైట్” అంది.

“గుడ్‌నైట్‌అమ్మా ఎండ్‌నాన్నా” అన్నారు పిల్లలిద్దరూ బుద్ధిగా.

“గుడ్‌నైట్‌బంగారూ, గుడ్‌నైట్‌రాక్షసుడూ” అన్నాడు విస్సూ ముద్దుగా, కాస్త ఆలోచిస్తూనే. మరో మైల్లో హడ్సన్‌రోడ్డు మీదకి ఎడమవైపు తిరిగితే, దానిమీద మరి ఎక్కువ దూరం వెళ్ళకుండానే హైవే ఎక్కెయ్యొచ్చు. స్నో అప్పుడే కొంచెం పేరుకుంటోంది.

“హమ్మయ్య. అటూ వసపిట్టలూ, ఇటు నీ పరధ్యానం కాదు కానీ ఏదో చెప్పాలని మొదలెట్టినదాన్ని ఎక్కడెక్కడికో తిప్పుతారు. నేను చెప్పేది వినవసలెప్పుడూ. మన సరోజా, రాధీల గురించి చెపుతున్నా! మనందరి మధ్యా స్నేహం గురించి ఎంత గొప్పగా అనుకుంటాం మనం? కానీ వాళ్ళు కూడా అలాగే అనుకుంటారని నాకేమాత్రం నమ్మకం లేదు. అసలివాళక్కడి మాటలు తలుచుకుంటే!”

శ్రీకి ఉద్వేగం గుండె లోతుల్లోంచి తన్నుకొచ్చేస్తోంది.

"ఇప్పుడేమయింది శ్రీ! అయినా నువ్వొక్కొక్కప్పుడు మరీ సున్నితంగా అయిపోతూ వుంటావు. అది వల్నరబిలిటీకి దారితీస్తుంది గుర్తుంచుకో. అయినా నువ్వేనా ఇందాకిందాకా రొమేంటిగ్గా వుండడంగురించి నాకు లెక్చరిచ్చింది? అటు నిద్రపోతున్న పిల్లలూ, ఇటు భావుకతని తట్టిలేపుతున్న ప్రకృతీ, నాకే కవిత్వమొచ్చేస్తూంటే. . ." అంటూ మాట మార్చబోయాడు విస్సూ.

"సరేలే, నీకు వేళాకోళంగా వుందికానీ, నేచెప్పేదీ కొంచెం విను. మంచి స్నేహమంటే చిన్నచిన్న విషయాలకి పెద్ద సీన్లు చెయ్యడమా? ఇవాళ కలిసినప్పుడు డిన్నరుకి తలో వంటకమూ తీసుకురావలసి వుండేదా? చివరి క్షణంలో ఏదో కొంచెం వంకాయకూరకి దినుసులన్నీలేక పచ్చడేదో రుబ్బి తీసికెళ్ళవలసిరావడం కాదు కానీ, కూరబదులు పచ్చడిచేసి తెచ్చి ఎంత శ్రమా ఖర్చూ తగ్గించుకున్నదీ, అదికూడా కొంచెం "ప్రత్యేకరుచి"ట ఎలా తెప్పించినదీ పదే పదే అందరితోనూ చెప్పి నన్నూదరగొట్టింది సరోజ. తన వ్యాఖ్యానానికి మిగతా వాళ్ళు వంత! ఓమాటంటే తమాషా, అలాగని పదిమార్లు అందరికీ అదే చెప్తూవెళితే ఎలా అర్థం చేసుకోవాలి? నాకు మాత్రం తిప్పికొట్టడానికైనా అలా మాట్లాడడం చేతకాదు సుమా!" శ్రీకి సాయంత్రం చాలా బాధగా అనిపించిందన్న విషయం గొంతులో తెలుస్తూనేవుంది.

హడ్సన్‌మీదకి తిరిగాడు విస్సూ. శ్రీని ఎలాగైనా సముదాయించాలి, కొంచెం యెక్కువగానే హర్టయినట్టుంది అనుకుంటూనే ఇంక మెల్లిగా హైవే ఎక్కేస్తే ర౯య్యిమని లాగించెయ్యొచ్చు. ఏముందీ మెల్లిగా విషయం మార్చి కబుర్లలో పడితే అరగంటలో ఇల్లూ, వెచ్చటి వాతావరణమూ. . .

"శ్రీ, నీ పిల్లల్లాగే నువ్వు కూడా బంగారంలా నామాట వినాలి. ఈ విషయం మరీ ఆలోచించొద్దు. కానీ, ఒకటి గుర్తు పెట్టుకో. నేనేం నీకన్నా పెద్ద ప్రపంచజ్ఞానం వున్నట్టు నటించబోవడం లేదు కానీ, నువ్వు ఒకవైపునుంచే ఆలోచిస్తున్నావేమో చూడొక్కమారు. వాళ్ళమాటలు కొంచెం బాధించగానే నువ్వు మొత్తం అంత విషయాన్నీ అదే ధోరణిలో మరీ మరీ ఆబాధని పెంచుకుంటూ పోయేటట్టుగా చేసుకుని వుండొచ్చు. టన్నెల్‌విజనంటారే ఇక్కడ, అది మరీ పెద్దమాటనుకో, అలాగన్నమాట. వాళ్ళు కూడా నీ ఫీలింగ్సు కొంచెం కనిపెట్టి తమాషా తగ్గించినా సరిపోయేదనుకో. కానీ మొత్తం స్నేహాన్నే శంకించడం మంచిది కాదేమో! నేనిలా చెప్పినందుకు నన్ను కూడా శంకించకేం, మొదటికే మోసమొస్తుంది!" అంటూ వాతావరణాన్ని కొంచెం తేలిక చెయ్యబోయేడు.

శ్రీకి విస్సూ చెప్పేదాన్లో నచ్చనిదల్లా ఒక్కటే. తనకి మనసు బాగులేనప్పుడు చెప్పేది వినో, దగ్గరకు తీసుకునో కొంచెం మనసు తేలిక చెయ్యడానికి మరీ ప్రయత్నించడు. ఎంతసేపూ లాజికల్‌గా ఆలోచించాలంటాడు. అలాగని విస్సూ చెప్పేది సబబు కాదని అనడానికి వీలుండదు. ఇలా కొంచెం పరస్పర విరుద్ధమైన ఆలోచనలతో సతమతమౌతూ ముభావంగానే ఉండిపోయింది శ్రీ.

పెళ్ళయి దశాబ్దం దాటే గడిచిపోవడంతో మాట్లాడకుండానే కమ్యూనికేట్‌చేసుకోవడం వారికి కొత్తేమీ కాదు. తనంత అనునయంగా చెప్పినదానికి మౌనమే సమాధానం కావడం విస్సూకి పెద్ద వింతగా అనిపించలేదు. తనమాటల గురించి శ్రీ ఆలోచిస్తూవుందన్న విషయం తెలుస్తూనే వుంది. అయితే ఇంకా సరోజా వాళ్ళ మాటలగురించి కుముల్తోందేమో అన్న అనుమానంతో ఒక్క క్షణం తనవైపు తిరిగాడు.

“అరె, ఆకారెలాగో చూడు, నువ్వు మాత్రం జాగ్రత్త” అంది శ్రీ హఠాత్తుగా ముందుకి చూపెడుతూ. ఏమయిందోనని గాభరా పడుతూ, కొంచెం నేరస్తుడిలా ఫీలవుతూ శ్రీ వైపునుండి చూపు తప్పించి తను చూపిస్తోన్నవైపు చూశాడు. పక్కలేనులో ఓకారు అప్పుడే గట్టిపడుతోన్న మంచు మీద నెమ్మదిగా భూచక్రంలా తిరుగుతోంది. నిప్పురవ్వలొకటే తక్కువ! అంటే కారు అస్సలా డ్రైవరు కంట్రోల్లో లేదన్నమాట. ఇద్దరు పిల్లలూ, ఎప్పుడూ వాళ్ళ సరంజామా, షాపింగులూ అన్నిటికీ వీలుగా వుంటుందని కొన్న వేనులో తను ఎత్తైనసీట్లో కూర్చొని వుండడంతో ఆకారు అలా స్లోమోషను బొంగరంలా తిరిగే దృశ్యం మరీ వివరంగా, కొంచెం భయం కలిగించేట్టుగా వుంది. అదృష్టవశాత్తూ ట్రాఫిక్‌ఆట్టే లేకపోవడంతో, తను కొంచెం తప్పుకోవడానికి వీలయింది. అలాగే ఆకారుని వేరే మరేకారూ ఢీకొనకుండా వుంటే బాగుణ్ణనుకుంటూ ఒక్క క్షణం మళ్ళా శ్రీవేపు చూసి ముందుకు దృష్టి సారించాడు విస్సూ. సుమారుగా అదే క్షణంలో శ్రీ కూడా ఒక్కమారు ఈలోకంలోకి వచ్చినట్టు విస్సూ ముఖంలోకి చూసింది.

శ్రీ ఆలోచనలు గ్రహించినట్టుగా అన్నాడు విస్సూ, కొంచెం వేగం తగ్గిస్తూ. “నేను చాలా జాగ్రత్తగా కారు నడుపుతాననీ, నాకెప్పుడూ అలాగవదని నీకు తెలుసుకదా, మరేం భయపడాల్సిందేమీ లేదులే. అయినా స్నోలో మామూలుగా కన్నా కొంచెం ఎక్కువ జాగ్రత్తగా కారు నడపాలందరూ.” వృద్ధదంపతులని తిట్టుకోవడమూ, ర(య్యిమని ఇంటికి లాగించే ప్రయత్నమూ అన్నీ అప్పుడే అవసరార్థం మరిచిపోయాడు.

"సరే, నువ్వు మరి ముందునుంచి నీ దృష్టి మరల్చకుండా కొంచెం జాగ్రత్తగా నెమ్మదిగా వెళ్ళు, ప్లీజ్" శ్రీ గొంతులో మరి సాయంత్రం జరిగిన విషయాల గురించి ఆలోచనా, బాధా అవేవీ లేవిప్పుడు, ఒక్క ఆందోళన తప్ప. హమ్మయ్య హైవే వచ్చేసిందిక, ఇంక కొంచెం జాగ్రత్తగా డ్రైవు చేసుకుని వెళిపోతే ఇరవై నిముషాల్లో ఇల్లు చేరొచ్చనుకున్నాడు. నెమ్మదిగా ఎడమవైపుకి ఖాళీ చూసుకుని హైవే మీదకి కలిస్తే చాలు.

అరె, ఇదేమిటి? ఏమిటవుతోంది... వెయిట్.. డేమిట్.. కారు కంట్రోలు తప్పుతున్నాది. ఇదెలా? తను స్టీరింగుని గట్టిగా పట్టుకొనే వున్నాడే! మరి తిన్నగా ముందుకి వెళ్ళడం లేదేం? సరే కొంచెం పక్కకి తిప్పి సరి చేస్తే చాలు...

"ఏయ్ విస్సూ, ఏమిటి? ఏమిటది... ఏమిటా డ్రైవింగు? ఏమిటి కారిలా? డూ సమ్‌థింగ్.. ఓ గాడ్" కారు వెనకభాగం అతినెమ్మదిగా ముందువైపుకి జారుకుంటూ కదులుతోంది. స్నో మీద స్కిడ్డవుతోంది.

"నువ్వాగు... నన్ను గాభరా పెట్టకు... ఏంచేసినా పనిచెయ్యడంలేదు. ఇంకేకారులూ గుద్దుకోకుండా చూడాలి!"

"ఓ నో..." పెద్దగా అరిచింది శ్రీ. పిల్లలు ఉలిక్కిపడిలేస్తూనే పరిస్థితి మామూలుగా లేదని కనిపెట్టి తొంగిచూస్తున్నారు. చేతన్‌కైతే డిస్నీలాండ్‌లోని రోలర్‌కోస్టర్‌లో వెళుతున్నట్టుగా నవ్వూ భయం ఒకేమారు వచ్చేస్తుంటే ఒకచేత్తో సీటు గట్టిగా పట్టుకొని రెండోచేత్తో కళ్ళు మూసీముయ్యకుండా దోబూచులాడుతున్నాడు.

"స్టాపిట్‌శ్రీ, ఏమిటా అరుపులు? నువ్వందరినీ భయపెట్టేస్తున్నావ్" అని చికాకుపడుతూనే, "ఓమైగాడ్" అని తనూ పళ్ళు గిట్టకరుస్తూ అరిచాడు విస్సూ. ఓ రెండువందల గజాల దూరంలో హెడ్‌లైట్లు. ఎత్తుగావున్న ఆ లైట్లని చూస్తేనే తెలుస్తున్నాది ఎదురుగా వేగంగా దూసుకొని వస్తున్నది మామూలు కారుకాదు, పెద్ద ట్రక్కని! అలాంటి పద్ధెనిమిది చక్రాల భారీట్రక్కులుకాని స్కిడ్డయినా ఢీకొన్నా జరిగే విధ్వంసం చెప్పనలవికాదు. పిల్లలు అవాక్కులైపోవడం ఎంతబెంబేలెత్తివుంటారో చెప్పకనే చెపుతోంది. ఆ కొద్ది క్షణాల నిశ్శబ్దంలో గుండె చప్పుళ్ళు మాత్రం అతిబిగ్గరగా తెలుస్తున్నాయి.

ట్రక్కు ఇంకా దగ్గరకు వచ్చేస్తోంది. అంతే, విస్సూకి తను చెయ్యాల్సింది అర్థమై పోయింది. ఆలోచించే వ్యవధి కూడా లేదు, కానీ ప్రయత్నం మాత్రం చెయ్యాల్సిందే. తను చెయ్యాల్సిందేదో చేసేసి తనపనైపోయిందన్నట్టుగా వేను సరిగ్గా ఆట్రక్కువస్తున్న లేనులోనే ఎదురుగా ఆగిపోయిందన్న విషయం మేఘాల్లోంచి మెల్లగా వెలువడిన కిరణంలా అప్పుడే విస్సూ స్ఫురణలోకి వచ్చింది. హైవేకి మొత్తం ఎడమవైపుగా, సాధారణంగా అన్నిటికన్నా వేగంగా పోయే వాహనాలు వెళ్ళే లేనులో ఆగింది వేను. కాపోతే ట్రాఫిక్‌మామూలుగా వెళ్ళేదానికి ఎదురుదిశలో! అతి నెమ్మదిగా బండిని బుజ్జగిస్తూ మెల్లగా కుడివైపుకి తీసికెళ్ళాలని విస్సూ ప్రయత్నం. ఆ ఎడమ చివరి లేనుకన్నా ఎడమవైపు వున్న ఖాళీజాగాలోకి వెళిపోతే పెద్దప్రమాదం తప్పించుకున్నట్టే. వేనుటైర్లు యెంత అరిగిపోయివున్నాయోకానీ అతననుకున్నట్టుగా వేనా ఖాళీజాగాలో ఆగలేదు. ఇంకా జారుకుంటూ వెళిపోతోంది. కొంతనయం హైవే ట్రాఫిక్కుకి దూరంగా వెళుతోంది! కానీ హైవేప్రక్కనంతా చిమ్మచీకటి. ఏమీ కనిపించడంలేదు.

కనుమూసి తెరిచేంతలో పెనుభూతంలాంటి పేద్ద ట్రక్కు వాళ్ళకి రెండులేన్ల అవతల దూసుకుపోయింది. నిజానికదేమీ మమూలుగా వెళ్ళేటంత వేగంగా కూడా వెళ్ళడంలేదు. అప్పటికే ఆ ట్రక్కుడ్రైవరుకి కొంతవరకూ అర్థమైనట్టుంది వీళ్ళ వేను వ్యవహారం. స్లోలో వేగం తగ్గించి వాళ్ళకి కొంచెం దూరంలో "ఆర్యూ ఆల్ ఓకే?" అని కుశలం కనుక్కుని మరీ వెళ్ళాడు, జవాబుదేముందిలే మామూలేనన్నట్టుగా.

ప్రమాదం తప్పినట్టే. కానీ వేనాగదే! కళ్ళు చించుకుని చీకట్లోకి చూడగానే విస్సూ గుండె జారిపోయింది! ఆచీకట్లో కింద లోతుగా పెద్దలోయ! ఆలోయలోపడకుండా వాహనలనాపేందుకున్న ఆటంకమల్లా ఓరెండడుగుల ఎత్తున్న రెయిలింగ్ అంతే. ఐదునిముషాల్లా అనిపించిన ఐదుక్షణాల్లో వేను వెళ్ళి దానికి తగలడం జరగనే జరిగింది. రెండులోహాల రాపిడికి వికృతంగా స్కీ౨చుమంటూ వచ్చే శబ్దం వేను ఆగడానికి కారణం కావడంతో మధురసంగీతంలా వినవచ్చింది. మొత్తానికి ట్రాఫిక్కుకెదురుదిశలోనైతేనేం చివరికి ఆగింది వాళ్ళ వేను. ఎన్నిమార్లు లోతైన లోయలమీదుగా హైవేలమీద కారు నడపలేదు! ఆమారుమూల ప్రదేశంలో హైవేమీద కిందలోయలోకి పడిపోకుండా ఆ రెయిలింగుపెట్టించిన హైవే ఇంజనీరుకు జోహారులర్పించాడు విస్సూ.

ఒక్క క్షణం భార్యవైపూ, పిల్లలవైపూ చూశాడు. పిల్లల్ల ముఖాల్లో పెద్దకళ్ళ వెనకాతల భయం

దాగడంలేదు. కోపం, ఆశ్చర్యం, పేద్ద ప్రమాదం తప్పిన వూరటా కలగాపులగంగా కనిపిస్తున్నాయి శ్రీలో. "ఎందుకిలా అయిందింతకీ? ఇంకా నయం, ఎంత ప్రమాదంతప్పింది! ఇందాకా కొన్ని క్షణాల్లో నాకేమనిపించిందో తెల్సా? ఏమైతే అవనీ అందరూ కలిసే వున్నాంగా అని. ఒకవైపు పిల్లలిప్పుడు మనతో లేకపోతే బాగుణ్ణని కూడా అనిపించింది కానీ పిల్లవెధవలకి మనంలేకుండా క్షణం కూడా గడవదే..." అంటూ చెప్పుకుపోతున్న శ్రీ గొంతు పూడుకుపోయింది. తనకు కూడా అదే ఆలోచన చూచాయగా రావడం గుర్తొచ్చింది విస్సూకి, కానీ ఆవిషయం ఇంకా కొనసాగించే ఇష్టం లేక వదిలేసాడు.

బ్రేకులన్నీ గట్టిగా వేసి పిల్లలవైపు తిరిగాడు. తల్లిహృదయం, ఎప్పుడువెళ్ళిందో కానీ శ్రీ వేనుదిగి అప్పటికే వెనక్కి పిల్లలదగ్గరకెళ్ళేసరికి ఇద్దరూ ఒక్కమారామెని హత్తుకుపోయారు. విస్సూ వేను ఎమర్జెన్సీ లైట్లు వేసి, తనుకూడా దిగి, ఎప్పుడైనా పనికిరావచ్చేమోనని ఎప్పుడో కొనివుంచిన ఎర్ర ట్రాఫిక్‌త్రికోణాన్ని వెళ్ళే డ్రైవర్లకి కనిపించేట్టు పెట్టాడు. మీద పడుతోన్న మంచును దులుపుకుని నెమ్మదిగా తనుకూడా వెనకసీట్లో భయాందోళనల్లోంచి సేదదీరుతున్న భార్యాబిడ్డల దగ్గరకు చేరాడు. అందరినీ కొంచెం దగ్గరకు తీసుకుంటూ "సారీ పిల్లలూ! మరేం ఫరవాలేదు. మరీ భయపడకండి" అన్నాడు. కానీ వాళ్ళ మొహాల్లోకి మాత్రం చూడలేకపోయాడు

"నాన్నా, నువ్వు కొంచెం జాగ్రత్తగా డ్రైవ్‌చెయ్యాలి. మనందరమూ పేద్ద ఏక్సిడెంటులో ఇరుక్కునివుండేవాళ్ళం" కొంచెం ఆరిందాతనమూ, కొంచెం ఆరోపణా, నిండా ఇంగ్లీషూ మిళాయించి ప్రైవేట్‌చెప్పేసింది ప్రీతి. భయంకలిగేసరికి తెలుగంతా మర్చిపోయినట్టుంది. "యా, వై డిడ్యూ డ్రైవ్ టువర్డ్స్‌దట్‌బిగ్‌ట్రక్?" అని వంతపాడాడు చేతన్. ఇలా అనుకోకుండా కురిసిన ఆరోపణల వర్షానికి అవాక్కైపోయిన విస్సూవైపు కొంచెం జాలిగా చూసి, "పిల్లలూ, తప్పు, నాన్నతో అలా మాట్లాడకూడదు. నాన్నేమీ ఆట్రక్‌వైపుకు డ్రైవ్‌చెయ్యలేదు. నాన్నేకాని జాగ్రత్తగా పక్కకి నడపకపోతే ఏక్సిడెంట్‌అయ్యేది." అంది శ్రీ. భార్య తనని సమర్థిస్తూ పిల్లలకి ధైర్యం చెపుతూన్న పద్ధతికి విస్సూ ఆమెవైపు ఆరాధనగా చూశాడు ఇందాకటి బేలతనంలోంచి ఇంతలోనే తేరుకున్నందుకు ఆశ్చర్యపోతూ.

ఇంతలో కర్తవ్యం గుర్తుకొచ్చింది. ఈ వేను హైవే ఎక్కుతూనే చేసిన విన్యాసాలను బట్టి స్నోమీద ఇంక ముందుకువెళ్ళడమనేది అంతమంచి ఐడియా కాదేమో. మరిప్పుడెలా? పోనీ కొంచెం రిస్కు తీసుకుని నెమ్మదిగా డ్రైవు చేసుకుంటూ వెళితే? తనొక్కడూ ఐతే ఏమో కానీ పిల్లలూ శ్రీతో కలిసివెళ్తూ రిస్కు

తీసుకునేదెలా? తనొక్కడూ ఐతే మాత్రం? ఇంత చిన్నపిల్లలున్నప్పుడు రిస్కు తీసుకునే హక్కు తనకు నిజంగా వుందా? వేదాంత ధోరణిలో నవ్వుకున్నాడు విస్సూ. "సరే శ్రీ, మరిప్పుడేం చేద్దామంటావ్? వేను టైర్లు బాగా అరిగిపోయాయని నా అనుమానం. ఇప్పుడీస్నోలో మనంతట మనమీ వేన్లో వెళ్ళడం నాకంత మంచిదనిపించడం లేదు." అన్నాడు.

"పోనీ..." అని ఏదో చెప్పబోయి ఆగింది శ్రీ. చెప్పేది మధ్యలో ఆపేసి వూరుకుండిపోయేసరికి విస్సూ "ఏంటి చెప్పబోతూ ఆపేస్తావేం, చెప్పు. కొంచెం కష్టమైనా మెల్లిగా ఇల్లు చేరగలిగితే సరి. రేపేదోటైములో స్నోతగ్గేక వచ్చి వేనుని తీసికెళ్ళొచ్చని నావుద్దేశం" అన్నాడు. కొంచెం ముఖావంగా, సందేహిస్తున్నట్టున్న శ్రీ అప్పుడే ఆలోచన వచ్చినట్టుగా అంది, "పోనీ టేక్సీలో వెళిపోదామా? ఐనా ఈవాతావరణంలో టేక్సీలు నడిపే నాథులుంటారంటావా?" ఎక్కడేం ఏక్సిడెంటయిందో కానీ ఎమర్జెన్సీ హారన్లు కొద్దిగా అప్పుడే వినిపిస్తున్నాయ్ విస్సూ శ్రీతో, "చాలా మంచి ఐడియా. నాకు తట్టనేలేదు సుమా. వాళ్ళీ స్నోలో మనల్ని వెతుక్కుంటూ రావడానికెంతసేపు పడుతుందో అదిమాత్రం చూడాలి." అన్నాడు. ఇంతలో పోలీసుకారొకటి లైట్లూ హారన్లూ గట్రా వేసుకుని వస్తూ కనిపించడంతో ఇద్దరికీ ఒకే మారొచ్చింది ఆలోచన, ఆకారు మనని చూసి ఆగితే బాగుణ్ణని. ఆకారొచ్చి వాళ్ళదగ్గరే ఆగడమూ, సెల్ఫోను మోగడమూ ఒకేమారు జరగడంతో, శ్రీని సెల్ఫోనందుకోమని చెప్పి విస్సూ పోలీసాఫీసర్తో మాట్లాడడానికి వెళ్ళాడు.

"హవ్వార్యూయ్ డూయింగ్?" అంటూ దిగాడా ఆరున్నరడుగుల పొడవున్న పోలీసు. "థేంక్యూ ఆఫీసర్" అంటూ మొదలెట్టాడు విస్సూ. మనసులో మాత్రం ఈదేశంలో పోలీసులని ఆఫీసర్లని అనడంలోని వింత గురించి ఆలోచిస్తూ.

*　　*　　*

పిల్లలు వెచ్చగా నిద్రపోతున్నారు. వాళ్ళకెప్పుడైనా భయమేస్తే వచ్చి అమ్మానాన్నా దగ్గర పడుక్కోవడం అలవాటే. కానీ ఇవాళ విషయం వేరు. శ్రీయే వాళ్ళని వదలకుండా ఇంటికొస్తూనే తమగదిలో పడుకోపెట్టేసింది. ఇద్దరికీ నిద్రపట్టడంలేదు. తనేనా లేక రెండోవాళ్ళు కూడా తనపరిస్థితిలోనే ఉన్నారా అని నిముషానికోమారు చూస్తూ చివరికి ఒకరికొకరు దొరికిపోయారు. నెమ్మదిగా లేచి పిల్లలకు నిద్రాభంగం కలగకుండా పక్కకి వెళ్ళి మాటల్లో పడ్డారు.

"ఎంత భయపడ్డారో ఏమాలోచనలతో సతమతమయ్యేరో పెర్రివాళ్ళు. రేపు స్కూళ్ళు తెరిచే అవకాశం

అస్సలు లేదు, కొంచెం ఎక్కువసేపు నిద్రపోనివ్వాలి. ఇలా వాళ్ళను చూస్తూవుంటే గుండె నిండిపోతోంది పెద్దప్రమాదాన్ని తప్పించుకున్న అదృష్టానికి." అంది శ్రీ.

"అందుకే అంటారు ఇక్కడివాళ్ళు 'కౌంట్‌యువర్‌బ్లెస్సింగ్స్' అని. నిజమే, ఎవరూ కష్టాలని తలుచుకుని స్పందించినంతగా అదృష్టాన్ని తలుచుకోరు. అసలు ప్రపంచం తీరే అంతేమో. టీవీలో వార్తలు చూస్తే ప్రపంచంలో జరుగుతున్న ఘోరాలకు దొరికే ప్రచారం మంచివార్తలకు ఎప్పుడోతప్ప దొరుకుతుందా అనిపిస్తుంది." అన్నాడు విస్సూ.

"నిజమే విస్సూ. ఇందాకా నువ్వు పోలీసుతో మాట్లాడుతున్నపుడు సరోజ ఫోన్‌చేసిందా? అంతకుముందు అసలు నాకొచ్చిన ఐడియా టేక్సీవాళ్ళకి ఫోన్‌చేద్దామని కాదు. సరోజావాళ్ళకైనా, రాధీవాళ్ళకైనా పోనీ ఫోన్‌చేద్దామా అని. నిజానికి ముందాకష్టంలో వున్నప్పుడు గుర్తొచ్చినదెవళ్ళు? మనవాళ్ళనుకొనే స్నేహితులు. ఈదేశంలో మనకున్న అన్నదమ్ములూ అక్కాచెల్లెళ్ళూ వాళ్ళేకదా, కానీ సాయంత్రం విషయమంతా నీకు చెప్పేను కదా. నా ఆలోచనలనిండా ఆబాధే నిండిపోవడంతో, మొత్తమ్మీద మాటమార్చి టేక్సీ పిలవమని చెప్పేను." కొంచెం గిల్టీగా నవ్వింది శ్రీ.

విస్సూ నెమ్మదిగా శ్రీ చేతిని తనచేతిలోకి తీసుకున్నాడు. "నేనర్థంచేసుకోగలను నువ్వెలా ఫీలవుతున్నావో. అంతెందుకు ఆట్రక్కుడ్రైవర్ని తీసుకో. అంత సూపర్‌స్పీడులోనూ మనకుశలమడిగి కూడా ఆగకుండా వెళిపోయిన అతని బిజినెస్‌సెన్సుకు నవ్వుకున్నానుకానీ, ఆపోలీసుకారుని పిలిపించింది అతనేనట. ఆట్రక్కు డ్రైవరు లావుగా అంత భీకరంగా ఉన్నాడా? అందులో పాపం నల్లవాడు కూడా. ఆగకుండా వెళిపోయినవాడు ముక్కూమొహం తెలియని మనగురించి అంత పట్టించుకుంటే, అతనిది బిజినెస్‌సెన్సని ముందు నేననుకోవడమే నాకు చాలా గిల్టీగావుంది. ఫలానాటైముకి అతని సరుకేదో డెలివరీ చెయ్యాలన్న పనిమీదున్నప్పుడు ఆగి అతను సానుభూతి చూపెట్టేకన్నా పోలీసు సహాయం పిలవడమే మంచిది కదా." అంటూ "అసలు నన్నడిగితే అతనో అసలైన అమెరికన్‌కర్మయోగనొచ్చు. పైకి భీకరంగావున్నాడుకానీ కానీ మనసుమాత్రం నవనీతమే పాపం" అని తనధోరణిలో వాతావరణాన్ని తేలిక చెయ్యబోయాడు.

శ్రీ అందుకుంది. "పోలీసొచ్చి మహా ఏంచేశాడు ఏదో మాట సహాయం సలహాలూ తప్ప? ఆతను రావడం ఏదో కొంచెం ధైర్యంగా అనిపించిందనుకో. సరోజా వాళ్ళూ స్పోన్నపడుతోన్న తీవ్రత చూసి ఇంటినుండి బయల్దేరిన మనందరికీ ఫోన్‌చేసి చేరారో, దారిలో ఏమైనా ఇబ్బందులెదురయ్యాయో

కనుక్కోవడంతో మనం చివరికిలా తేలేంకానీ. ఫోన్‌మీద అసలు సరోజ నామాట వినదే! పిల్లలెలావున్నారు, దెబ్బలేమైనా తగిలాయా అంటూ అసలు వూపిరాడనివ్వలేదు. పాపం, డిషెసన్నీ పక్కకి పెట్టి నెమ్మదిగా నిద్రపోవడానికి సిద్ధమౌతూ వుండి వుంటారు మనకి ఫోన్‌చేసినప్పటికి. అప్పటికప్పుడు బయలుదేరి మరో ఆలోచనే లేకుండా వచ్చేశారిద్దరూ. వాళ్ళు మనం వెయిట్‌చేస్తున్న చోటికి వచ్చేసరిక్కానీ నాకు వాళ్ళ టైర్లు కూడా మనవాటిలాగే అరిగిపోయాయేమో చూసుకునిమరీ బయలుదేరమని చెప్పాలని తట్టలేదు. తనధోరణిచూస్తే నాకావిషయం తట్టి చెప్పినా అసలు పట్టించుకునివుండేదనుకోను. అదృష్టవశాత్తూ వాళ్ళ కారు టైర్లు బాగానే వుండడంవల్ల, వాళ్ళే మనల్నింటి దగ్గర దింపడం జరిగిందికానీ.”

“ఏమిటో శ్రీ, వాళ్ళతో మనకిన్నేళ్ళుగా స్నేహంకదా, కానీ ఇవాళో ప్రత్యేకమైన కోణంలోంచి చూస్తున్నాం మన అనుబంధాన్ని. ఏదో గుండెల్ని తాకే సంఘటన జరిగితే తప్ప మనమెన్ని విధాలుగా అదృష్టవంతులమో చూసుకోమేమో. అలాగే మన దృక్పథాలు కూడా. సంకుచితమని అనుకోనక్కరలేదేమో కానీ, ఇంకొంచెం విశాలంగా ఆలోచించవచ్చు. ఇందాకా రోడ్డుమీదా పెద్దాయన కొంచెం నెమ్మదిగా కారు నడుపుకుంటూ వెళ్ళేసరికి, వాళ్ళనీ వాళ్ళకి మనంకట్టే టేక్సులవల్ల వచ్చే సోషల్‌సెక్యూరిటీ ఆదాయాన్నీ తూర్పారబట్టానా? నిజానికి ఎటునుంచి చూసినా వాళ్ళమీదంత చికాకుపడవలసిన అవసరముందా నాకు? సంఘమూ దేశమూ ముందుకుపోయేందుకు వాళ్ళ వంతు చెయ్యవేసిన తరవాతేకదా వాళ్ళు రిటైరయినది. పైగా స్లోపడడం గమనించి వాళ్ళమానాన్ని వాళ్ళు జాగ్రత్తగా డ్రైవు చేసుకుంటూ పోతూంటే నిజానికి వాళ్ళని చూసి నేనుకూడా వేగం తగ్గించవలసిందిపోయి తిట్టుకున్నాను. దానివల్ల వాళ్ళకేమీనష్టంలేదనుకో కానీ. . .” అని చెప్పుకుపోతున్నాడు విస్సూ.

“వాళ్ళ విషయమలా వుంచు విస్సూ, వాళ్ళు మనకు కనీసం తెలియనుకూడా తెలియరు. కానీ ఇంతకాలంగా తెలిసిన సరోజని నేను ఏదో చిన్నమాటందని క్షమించలేకపోవడమూ పైగా అంతసేపు కుమలడమూ సిగ్గుపడాల్సిన విషయాలు. ఆసలు క్షమించడమంత పెద్దమాటే అనవసరమేమో. సరోజపద్ధతే అంత, ఏమీ బాధపెట్టేవుద్దేశం తనకెప్పుడూ వుండదుకానీ తమాషాగా ఏదో అంటుంది. పోనీ తెలియనివాళ్ళనైతే అవంత బాధపెట్టినా అర్థముంది కానీ నాకు తనపద్ధతి తెలిసికూడా నేనావిషయంలో అంత తక్కువతనంతో ఎందుకాలోచించానో నాకే తెలీదు. కార్లో తనని పిల్లల్ని కూడా వదలి ఎందుకువచ్చావని నేనడిగితే ఏమందో తెల్సా? వాళ్ళాయన్ని ఆకొద్దిగంటలసేపూ వదిలివుండలేక వచ్చేసిందిట. మళ్ళీ అదే పద్ధతి. నిజానికదేమీ కాదు, ఎంతసేపూ మొత్తం వివరాలన్నీ

కనుక్కొని మనకెవ్వరికీ ఏమీ అవకుండా బయటపడినందుకెంత సంతోషించిందో. వస్తూ వస్తూ మనదగ్గరకి చేరేముందే మన క్షేమంకోసం దేవుడికో మొక్కు కూడా మొక్కేసింది. అయినా తనొకవేళ ఏదో తప్పుగానే అందనుకున్నా 'ఫర్గివ్‌ఎండ్‌ఫర్గెట్' అని నేను తీసుకుంటే తనకొరిగిపోయేదానికన్నా నాకే ఎక్కువ మనశ్శాంతిగా ఉండేది." అంది శ్రీ కిటికీదగ్గరకెళ్ళి బయటకెటో దూరంగా తొంగిచూస్తూ.

బాగా ఎఫెక్టయినట్టుందనుకున్నాడు విస్సూ. మనసెంతో సంఘర్షణకి లోనైనట్టుగా తెలుస్తూనేవుంది, కానీ చాలా నిశ్చలంగా వున్నాయామె మాటలు. బయటెంతో అందంగా వుంది. చలిమంచు కుప్పలుగా పేరుకుపోయి చీకటిలో వెలుగులు వెదజల్లుతూ భూదేవి అందాన్ని తెల్లచీరలో ద్విగుణీకృతం చేస్తున్నట్టుంది. ఇంకా మంచు కొంచెం పడుతోంది కానీ కిందేమీ తేడా తెలియడంలేదు. ఇంకా ఎంతో మంచుపడితే తప్ప యీ అందమైన ప్రకృతిలో మార్పేమీ రాదు. మారినా మహా ఐతే మరికొంచెం అందమూ గాంభీర్యమూ సంతరించుకుంటుందంతే అనుకున్నాడు విస్సూ. కానీ డ్రైవువేలో సరోజావాళ్ళ కారు వచ్చివెళ్ళినగుర్తులుమాత్రం ఇప్పుడప్పుడే చెరిగేట్టులేవు.